క్లుప్తంగా

డీఎస్సీలో వెయిటేజీ కల్పించాలి



డీఎస్సీలో వెయిటేజీ కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న వెంకన్నబాబు, ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పార్ట్‌టైమ్ ఉద్యోగుల అందరికీ వెయిటేజీ కల్పించాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. గడచిన 15 సంవత్సరాలకు పైగా సమగ్ర శిక్ష ప్రాజెక్టులో తక్కువ వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తూ విద్యారంగానికి సేవలందిస్తున్నామన్నారు. తమ సేవలను పరిగణనలోకి తీసుకుని వెయిటేజీ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గొల్లపాలెంలో చలివేంద్రం ఏర్పాటు

కాజులూరు: గొల్లపాలెంలోని సాక్షి రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం చలివేంద్ర ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మహేష్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి మజ్జిగ పంపిణీ చేసి ప్రారంభించారు. వేసవి కారణంగా రోజురోజుకీ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో కాకినాడ, కోటిపల్లి రహదారిపై వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని మహేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత తన్నేరు మహేష్ తెలిపారు. క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన ఉండాలి

కాజులూరు: తమ పొలంలోని భూమి సారవంతంపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకుని దానికనుగుణంగా సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని చేదువాడ, గొల్లపాలెం, బందనపూడి తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలోని భూసారాన్ని పరీక్షించుకోవడం ద్వారా ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. తద్వారా ఖర్చు తగ్గి నికర ఆదాయం పెరగడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ శిరీషా, రమ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ అసమానతలు లేని సమాజ నిర్మాణంలో పాలుపంచుకుందామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మండలంలోని చోడవరంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



కోటిపల్లి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో మండల ప్రజాపరిషత్ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల నుంచి విద్యార్థి కర్రి దుర్గాప్రసాద్ నవోదయకు ఎంపికయ్యేందుకు చేసిన కృషిని అభినందిస్తూ ఉపాధ్యాయులు చోడి రామకృష్ణ, ఆతం కిషోర్‌కుమార్, నవోదయకు ఎంపికైన దుర్గాప్రసాద్‌లను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో సత్కరించి పూలదండలతో అభినందించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. అదే విధంగా నవోదయకు ఎంపికైన విద్యార్థికి గాలి బాలాజీ రూ.6 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు కేఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

రామచంద్రపురం రూరల్: మండలంలోని కోటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఆవకాయ పచ్చడి

- పచ్చళ్ల సీజన్ మొదలు
- గతంతో పోల్చితే తగ్గుతున్న పట్టుబడి
- అనారోగ్యాలు, అంగట్లో లభ్యం కావడమే కారణాలు



మార్కెట్‌లో మామిడికాయలు అమ్ముతున్న వ్యాపారులు



మామిడిని ముక్కలుగా కోస్తున్న వ్యక్తి

రాయవరం: వేడివేడి అన్నంలో కాస్త నెయ్యి వేసుకుని ఆవకాయతో అన్నం తింటుంటే ఆ రుచే వేరబ్బా. తెలుగు వారి లోగిళ్లలో పచ్చళ్లకు ప్రాధాన్యం ఎక్కువే. వేసవి వచ్చిందంటేనే పచ్చళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. జిల్లా వ్యాప్తంగా పచ్చళ్లు పట్టుకోవడం ప్రారంభమైంది. మార్కెట్లోకి పచ్చడి మామిడి కాయలు విరివిగా వస్తున్నాయి. ప్రతి రోజు ఉదయాన్నే మార్కెట్లు పచ్చడి మామిడి కాయ వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా మారుతున్నాయి. ప్రస్తుతం సీజన్‌లో ప్రతి కుటుంబం ఎంతో కొంత మేర వారి శక్తికి తగ్గట్టుగా పచ్చళ్లు పెట్టుకుంటున్నారు. ఏ పచ్చడి పెట్టినా పెట్టకపోయినా ప్రతి ఒక్కరూ ఆవకాయ, మాగాయి పచ్చడి మాత్రం తప్పనిసరిగా తయారు చేసుకుంటారు. సాధారణంగా కర్తె సీజన్ ప్రారంభం కాకముందే పచ్చళ్లు పట్టడం పూర్తి చేస్తారు. ప్రస్తుతం దేశవాళి, సూదలు, రసాలు, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, హైదర్‌సాహెబ్ తదితర రకాల మామిడికాయలు మార్కెట్‌లోనికి వస్తున్నాయి. మామిడికాయలను సాధారణ రకాలు రూ.500 నుంచి 1,000 వరకు, నాణ్యమైన రకాలైన హైదర్‌సాహెబ్, కొత్తపల్లి కొబ్బరి వంటి రకాలను రూ.1,500 నుంచి రూ.2వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. కాయ రకం, సైజును బట్టి ధర పలుకుతుంది.

పరిమాణం తగ్గినా..

మామిడికాయల ధరలు అధికంగానే ఉన్నప్పటికీ, పచ్చడిలో వినియోగించే ముడి సరుకులైన గానుగ నూనె, ఎండు మిర్చి, ఆవాలు, మెంతులు, వెల్లుల్లి, ఉప్పు ధరలు గతేడాదితో పోలిస్తే కొంతమేర అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పచ్చడి పెట్టడం భారంగా మారుతుంది. కుంచుడు ముక్కలతో పచ్చడి పెట్టాలంటే దాదాపు రూ.1,500 వరకు ఖర్చవుతుందని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలు, కూలీలు పనులకు వెళ్లే హడావుడి సమయాలలో కూరలకు బదులుగా తమ ఆహారంలో పచ్చడినే వినియోగిస్తారు. మార్కెట్‌లో వివిధ పరిమాణాల్లో వివిధ రకాల పచ్చళ్లు అందుబాటులోకి రావడంతో సామాన్య ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చళ్లు పట్టుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. జిహ్వ చాపల్యం చంపుకోలేని వారు మాత్రం ప్రమాణాన్ని తగ్గించుకుని పచ్చళ్లు పట్టుకుంటున్నారు.


పలు కారణాలతో..

గతంతో పోలిస్తే పచ్చళ్లు పట్టుకునే వారి సంఖ్య ఏడాదికేడాది తగ్గుతుంది. ప్రజల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు, ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటుగా అంగట్లో పలు రకాల పచ్చళ్లు దొరకడం కూడా కారణంగా చెబుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ వంటి వ్యాధులు తగ్గడంతో వైద్యుల సలహా మేరకు పచ్చడి తినడాన్ని చాలా మంది తగ్గిస్తున్నారు. పచ్చళ్ల తయారీ కేంద్రాల నుంచి నేరుగా మార్కెట్లోకి అందుబాటులోనికి వస్తున్నాయి. దీనితో అవసరమైన సమయంలో తమకు కావాల్సిన పచ్చడిని ఒక్కో ప్యాకెట్, బాటిల్ పచ్చడిని కొనుగోలు చేసుకుంటున్నారు.



ఆవకాయ తయారు చేస్తున్న మహిళలు

మాజీ సీఎం జగన్‌ను కలసిన ఎమ్మెల్సీ తోట



తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశంలో ఎమ్మెల్సీ, అడ్వైజరీ కమిటీ సభ్యుడు తోట త్రిమూర్తులు హాజరయ్యారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రిటైర్డ్ ఉపాధ్యాయినికి సత్కారం

రాయవరం: మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఇంగ్లీషు ఉపాధ్యాయిని చింతపల్లి కృష్ణకుమారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం నూలు ఆదినారాయణ ఆధ్వర్యంలో చింతపల్లి కృష్ణకుమారికి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ నెల 30న కృష్ణకుమారి ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో వేసవి సెలవుల కారణంగా ముందుగానే వీడ్కోలు పలికారు. కృష్ణకుమారి ఇంగ్లీషు ఉపాధ్యాయురాలిగా అందించిన సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతికి ప్రతీక



అంగర పోతురాజు ఊరేగింపు సందడి

కపిలేశ్వరపురం: దేవతామూర్తుల జాతరలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అంగర పోతురాజుగూడెంలో ఉన్న శ్రీకూనాలమ్మ సమేత గనిపోతురాజును మంగళవారం ఆయన దర్శించుకొన్నారు. స్వామి ఆలయ 3వ వార్షికోత్సవంలో భాగంగా పోతురాజుగూడెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను నిర్వహించారు. సోమవారం స్వామికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. మంగళవారం సామూహిక పూజా కార్యక్రమం, అశ్వ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు.విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆడపడుచులు స్వామి మొక్కులు తీర్చుకొన్నారు. నేడు స్వామికి నైవేద్య సమర్పణతో ఉత్సవం ముగియనున్నట్టి సంఘం పెద్దలు తెలిపారు. స్వామిని దర్శించుకొన్నవారిలో మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ, గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావుదొర

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, మండపేట అర్బన్ పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ సుమలత మంగళవారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర మాట్లాడుతూ రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులకు ఈ విషయం తెలియజేసి స్కానింగ్‌లకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ, స్కూల్ విద్యార్థులను నూరు శాతం స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి హైపర్ టెన్షన్, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్ సర్వేలో నమోదు చేయాలని సూచించారు. ఆయుష్మాన్ కార్డులు ఈ-కేవైసీ చేయాలని కోరారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రతి పీహెచ్‌సీలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హేమ సుధీర్, డాక్టర్ వీరభద్రారెడ్డి, డాక్టర్ భవాని, డాక్టర్ రమ్య, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేశు తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు అక్రమంగా గోవుల తరలింపు



వాహనంలో తరలిస్తున్న గోవులు

రాయవరం: రాత్రి సమయంలో గోవులను అక్రమంగా కబేళాకు తరలిస్తుండగా రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట సంత నుంచి ద్రాక్షారామంలోని కబేళాకు గోవులను తరలిస్తున్నారు. అశోక్ లేలాండ్ వాహనంలో ఏడు గోవులను ద్రాక్షారామానికి చెందిన కనికెళ్ల వెంకన్నబాబు, వాహనం డ్రైవర్ కాకాడ శివప్రసాద్ తరలిస్తున్నారు. విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు మాచవరం సెంటర్ వద్ద దాడి చేసి పట్టుకున్నట్టు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గోవులను గోశాలకు తరలించామన్నారు.

గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే

కపిలేశ్వరపురం (మండపేట): పలు పంటలను సాగు చేస్తోన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని, ఆ దిశగా ప్రయత్నించేసి రైతులకు న్యాయం చేయాలని ఏపీ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. మండపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడులు పెరగడమూ, దిగుబడి అంతంత మాత్రం కావడమూ, వాతావరణ పరిస్థితుల ప్రతికూలత, ప్రభుత్వసాయం దక్కకపోవడం కారణంగా రైతులు తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు రాజకీయాలకు అతీతంగా రైతుపట్ల సానుకూలతతో సాయమందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు జిల్లా పెదకూరపాడులో వర్షానికి తడిచిన పొగాకు ఉత్పత్తికి గిట్టుబాటు ధర లభించని అసహనం చెందిన రైతు షేక్ యాసిన్ తన పొగాకు పంటను తగలబెట్టడం ఈ రాష్ట్రంలో రైతుల దీన స్థితికి నిదర్శనమన్నారు. రైతు షేక్ యాసిన్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని కామన తెలిపారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: పాఠశాల అభ్యసనం నుంచే విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన అవసరమని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి అన్నారు. స్థానిక పీఎంశ్రీ పాఠశాలలో మంగళవారం 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందిన విద్యార్థులకు వృత్తి విద్య ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వృత్తి విద్యా శిక్షకురాలు లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

పూర్వపు స్థానాలకు టీచర్ల సర్దుబాటు

రాయవరం: విద్యా సంవత్సరం బుధవారంతో ముగియడంతో గతంలో సర్దుబాటుకు గురైన టీచర్లు పూర్వపు స్థానాల్లో బుధవారం ఉదయం చేరనున్నారు. విద్యార్థుల సంఖ్యకు మించి ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు అవసరమైన పాఠశాలలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో సర్దుబాటు చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వివిధ క్యాడర్లలో పని చేస్తున్న 400 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. వీరందరిని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ చేసి, పూర్వపు పాఠశాలల్లో చేరాల్సిందిగా విద్యాశాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు మంగళవారం విధుల నుంచి విడుదలై, బుధవారం ఉదయం పూర్వపు స్థానాల్లో చేరనున్నారు.

మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం చేయవద్దు



మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: ప్రజా ప్రయోజనాలకు మున్సిపాలిటీ నిధులను సక్రమంగా వినియోగించాలని, చేసిన పనులకే నిధులు కేటాయించటం మూలంగా నిధులు దుర్వినియోగం జరుగుతుందని కౌన్సిల్ సభ్యులు వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు కౌన్సిల్ సమావేశంలో సూచించారు. పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొత్తం 46 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యులు ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ఇందులో రెండో అంశమైన పట్టణంలోని పలు డ్రైన్లలో సిల్టు తీయడానికి రూ.44.60 లక్షలతో కూడిన ప్రతిపాదనలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం కొరకు ప్రవేశపెట్టడాన్ని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఆరు నెలల క్రితం పట్టణంలో వివిధ డ్రైన్లలో సిల్టు తీసేందుకు సుమారుగా రూ.56 లక్షలను వినియోగించి సిల్టు తీయటం జరిగిందని, తిరిగి మరలా ఇప్పుడు రూ.44.60 లక్షలతో సిల్టును తీయటం మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం చేయడమేనని తెలిపారు. దీంతో సభ్యులు ఈ అంశాన్ని తిరస్కరించారు. కాగా 6వ అంశంలోని నాలుగు పనుల ఆమోదం కొరకు సభ్యుల అనుమతి కోరగా వాటిని సభ్యులు తిరస్కరించారు. 6వ అంశంలోని ఒకటో పనిగా ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్‌లోని యూపీఎస్ బ్యాటరీ, లైటింగ్ తదితర వాటికి గాను రూ.3.5 లక్షలతో చేసేందుకు ప్రతిపాదనలు చేయగా వాటిని అంత ఖర్చు అవసరం లేదని, తిరిగి మరలా ప్రతిపాదనలు చేయాలని సభ్యులు సూచించారు. కాగా మూడో పనిగా మున్సిపాలిటీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.4.90 లక్షలు ప్రతిపాదనలు చేయగా మున్సిపాలిటీ నిధులతో సీసీ కెమెరాలు వేయడం కుదరదని సభ్యులు తెలపడటంతో దీనికి సభ్యులు ఆమోదం తెలపలేదు. కాగా మొత్తం 46 అంశాలకు గాను ఒక అంశాన్ని తిరస్కరించగా మరో రెండు పనులను కూడా సభ్యులు తిరస్కరించారు. సమావేశం అనంతరం విశాఖపట్నం గ్రేటర్ మున్సిపాలిటికి బదిలీపై వెళుతున్న కమిషనర్ అయ్యప్పనాయుడుని కౌన్సిల్ సభ్యులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

సామాన్యుల సారథి ఎమ్మెల్సీ తోట

ఆయన జన్మదిన వేడుకల్లో వక్తలు



మండపేటలో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): సామాన్య ప్రజల పక్షపాతిగా ఎమ్మెల్సీ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు తోట త్రిమూర్తులు నిరంతరం ప్రజల్లో పని చేస్తున్నారని ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట పట్టణం, రూరల్ మండలం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తణుకు అశోక్, సాకా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరుపేదలకు పండ్లు, దుప్పట్లు అందజేశారు. వారిచే ఆదర్శ హెల్పింగ్ సెంటర్‌లో వృద్ధులకు భోజనాన్ని వడ్డించారు. పార్టీ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ సమస్య చెప్పిన వెంటనే పరిష్కారం దిశగా కృషి చేయడం ఎమ్మెల్సీ తోట సహజ సిద్ధమైన అలవాటు అన్నారు. నాయకులు జిన్నూరి సాయిబాబా, చోడే శ్రీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత తోటకు దక్కుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, నాయకులు శిరిపురపు శ్రీనివాస్, పోతంశెట్టి ప్రసాద్, మందపల్లి రవికుమార్, మొండి మురళి, జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా దాలయ్య, షేక్ ఆలీఖాన్‌బాబా, టేకుమూడి శ్రీను, ఈలి తాతాజీ, అధికారి శ్రీను, సాకా శ్రీనివాస్, పి.సుబ్బరాజు, ప్రసాద్, నాగు, బద్రి పాల్గొన్నారు.

ఘనంగా ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



రాయవరంలో పుంతలో పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: గ్రామంలో కొలువైన పుంతలో ముసలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు బండి వెంకటరామసుబ్రహ్మణ్యం, కూరెళ్ల సూర్యనారాయణయమూర్తి, శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, వినాయక పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, వాస్తు, నవగ్రహ మండపారాధనలు, అమ్మవారికి జలాధివాసం, పుష్పాధివాసం, అంకురారోపణ, అగ్ని మథనం, హోమం, ధాన్యాధివాసం, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 10.42 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, మండప పునఃపూజలు, పూర్ణాహుతి, బలిహరణ, గోముఖ దర్శనం తదితర పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

తొలి సోషలిస్ట్ విప్లవ నిర్మాత లెనిన్‌కు ఘన నివాళి



ద్రాక్షారామలో పార్టీ జెండా ఆవిష్కరించి లెనిన్‌కు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

రామచంద్రపురం రూరల్: ప్రపంచంలో తొలి సోషలిస్ట్ విప్లవ రాజ్యాన్ని స్థాపించిన ఘనత వీఐ లెనిన్‌కే దక్కుతుందని ప్రజా సంఘాల నేతలు అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక స్తూపం వద్ద లెనిన్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ముందుగా పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం స్తూపం దగ్గర సీపీఐ(మార్క్సిస్ట్-లెనినిస్టు) న్యూడెమొక్రసీ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పార్టీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూలు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి రష్యా సోషలిస్ట్ శ్రామిక రాజ్యాన్ని స్థాపించిన వీఐ లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుని దేశంలో దళిత, ఆదివాసీ, మైనార్టీలకు, కార్మికులకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. లెనిన్ జయంతి రోజునే భారత విప్లవ పార్టీ సీపీ (ఎంఎల్) ఆవిర్భవించి 67 ఏళ్లు అవుతుందన్నారు. అదే విధంగా సీపీఐ ఎంఎల్ న్యూడమోక్రసీ పార్టీ ఏర్పడి 37 సంవత్సరాలు అవుతుందన్నారు. లెనిన్ స్ఫూర్తితో పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, చల్లపూడి పట్టాభిరామయ్య, తవిటికి లక్ష్మణ్, పి.రామకృష్ణ, డి.అప్పారావు, డి.చిన్నబాబు, ఆర్.అప్పారావు, ఆర్.ప్రసాద్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మెమో 1214ని రద్దు చేస్తామని బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరిస్తామని నోటి మాటగా చెప్పడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో సైతం పొందుపరిచారని తమ న్యాయమైన డిమాండ్స్ అయిన బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కలసి వినతిపత్రం అందించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూకల బలరాం, జి.దుర్గాప్రసాద్‌లు మంగళవారం తెలిపారు. గతంలో మంజూరు చేసి పెండింగ్‌లో ఉంచిన క్లెయిమ్‌లకు వెంటనే నిధులు చెల్లించాలని, కార్మికుల సంక్షేమ పథకాల అమల కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలని వివరించినట్లు తెలిపారు. వివిధ సందర్భాల్లో గత ప్రభుత్వాలు అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. మంత్రి సుభాష్ స్పందిస్తూ న్యాయమైన డిమాండ్లను రెండు నెలల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.దుర్గమ్మ, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పిండి కాశిదాసు, అధ్యక్షుడు విప్పర్తి మోహన్‌రావు, గంధం నారాయణమూర్తి, సలాది కిరణ్‌కుమార్, కుంపట్ల నాగేశ్వరరావు, మూర్కొండ రాజు, రావూరి నాగేశ్వరరావు, కుంపట్ల బుజ్జి, గోవింద్, బ్రహ్మజీ, పిండి ప్రసాద్, కామిరెడ్డి రుద్రమూర్తి, శివ, జిల్లా నలుమూల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు

పీఠంలో హాస్య నటుడు అనంత్ పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో సినీ హాస్య నటుడు పుణ్యవర్తుల అనంత్ మంగళవారం పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న వెదురుపాక విజయదుర్గా పీఠం వద్ద దుర్గాదేవి, గురుప్రదక్షిణ కార్యక్రమాన్ని అనంత్ ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలకు విజయదుర్గా పీఠంతో పాటుగా, అమ్మవారు పీఠం పక్కనే అమ్మవారు వెలసిన మూల పీఠం చుట్టూ ఉన్న నాలుగు వీధుల్లో ఆయన అమ్మవారి, గురుప్రదక్షిణ కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారు, గురుదేవులు విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్)పై ఉన్న భక్తితో తాను ఈ ప్రదక్షిణలు చేసినట్లు తెలిపారు. అనంత్‌తో పాటు పలువురు భక్తులు విజయదుర్గాదేవి, గురుప్రదక్షిణలో పాల్గొన్నారు.

పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టాలి

కపిలేశ్వరపురం: పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఆర్.నాగేశ్వరి, నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామలక్ష్మి అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా గ్రామ వీధుల్లో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉన్నది ఒక్కటే భూమి అని భూమిని పరిరక్షించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలు ఉనికి ఆధారపడి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వదులుకోవడంతో పాటు మొక్కల పెంపకాన్ని జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.